

నందన్న సంబరాలకు సన్నాహాలు 6లో



నందన్న విగ్రహాన్ని తెస్తున్న దృశ్యం

ఎయిర్‌పోర్టుతోనే అభివృద్ధి

- పరిశ్రమల స్థాపనకు అవకాశాలెన్నో
- రైతులు, ప్రజల్లో అపోహలు తొలగిస్తాం
- కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు
- పలాసలో అవగాహన సదస్సు



మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, పక్కన మంత్రి అచ్చెన్నాయుడు తదితరులు

పలాస, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): 'పలాసలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుతో జిల్లా రూపురేఖలు మారనున్నాయి. పరిశ్రమలు నెలకొల్పడానికి పారిశ్రామికవేత్తలు తరలివస్తారు. ఉద్దానంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుంది. దీనిపై రైతులకు ఉన్న అపోహలు తొలగిస్తామ'ని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఆదివారం పలాస రైల్వే ఇనిస్టిట్యూట్‌లో ఎమ్మెల్యే గౌతు శిరీష అధ్యక్షతన వజ్రపుకొత్తూరు, మందస మండలాల ప్రజలు, రైతులతో సమావేశమయ్యారు. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సంబంధించి అపోహలు, సందేహాలు తొలగించేలా అవగాహన కల్పించారు. 'ఎయిర్‌పోర్టు వల్ల అనుబంధంగా 140 వరకూ వివిధ సంస్థలు ఉంటాయి. దీని ద్వారా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. నా తండ్రి దివంగత నేత ఎర్రన్నాయుడుకు ఉద్దానం ప్రాంతమన్నా.. ప్రజలన్నా అభిమానం. అప్పట్లో ఉద్దానం రక్షితనీటి పథకాన్ని తీసుకువచ్చి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారు. నేను కేంద్రమంత్రిగా పలాసలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు శ్రీకారం చుట్టాను. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష చొరవతో ఈ ప్రాంతంలో ఎయిర్‌పోర్టు నిర్మించాలని భావించాం. కేంద్రం కూడా దీనికి అంగీకారం తెలిపింది. ప్రజలు ఆమోదిస్తే ఎయిర్‌పోర్టు నిర్మాణానికి మార్గం సుగమం అవుతుంది. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకుంటాం. ఎయిర్‌పోర్టు తరువాత పైలెట్ ట్రైనింగ్ సెంటరు కూడా తీసుకువచ్చే ఆలోచన ఉంద'ని కేంద్రమంత్రి తెలిపారు.

- ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ 'ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది స్వార్థపరులు వారి దృష్టిని మరల్చి జిల్లాను వెనుకబాటుతనానికి గురిచేశారు. వాస్తవానికి ఎయిర్‌పోర్టుకు భూములు ఇవ్వడానికి (మిగతా 6వ పేజీలో..)

ఒక్కరైతూ నష్టపోడు
మంత్రి అచ్చెన్నాయుడు

- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ 'ఎయిర్‌పోర్టుకు స్థలాలు ఇవ్వాలి. ఏ ఒక్క రైతూ నష్టపోకుండా పరిహారం ఇచ్చే బాధ్యత నాదే. పంటకు నష్ట పరిహారంతోపాటు నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పిస్తాం. దీంతోపాటుగా మరో ప్యాకేజీ ఇచ్చేలా సీఎం చంద్రబాబును ఒప్పిస్తాం. రాజధాని అమరావతికి ల్యాండ్ పూలింగ్ ఇచ్చిన విధంగానే ఇక్కడా పరిశీలిస్తామ'ని రైతులకు భరోసా ఇచ్చారు.

సంతోషంగా ఉంది

ఉద్దానం ప్రాంతానికి ఎయిర్‌పోర్టు వస్తుందంటే ఇప్పటికీ నమ్మలేకపోతున్నాం. మాకు ఎంతో సంతోషంగా ఉంది. అయితే రైతులకు తీవ్ర కష్టాలు ఉన్నాయి. ఎకరాకు కనీసం నష్టపరిహారం రూ.కోటి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఎంత మేరకు భూ సేకరణ జరుపుతున్నది ప్రకటించాలి.

\- కూర్మారావు, మాజీ సర్పంచ్

భూములివ్వడానికి సిద్ధం

మేము భూములు ఇవ్వడానికి సిద్ధంగానే ఉన్నాం. నిరుద్యోగులు అందరికీ ఉద్యోగాలు కల్పించాలి. రైతులు, ప్రజలకు ఉన్న అపోహలు గ్రామసభలు ద్వారా తొలగించాలి.

\- తామాడ లోకనాథం, రైతు, బిడిమి



నేడు పైడిమాంబ
తొలేళ్ల సంబరం

- రేపు సిరిమానోత్సవం
- ఏర్పాట్లు పూర్తి

విజయనగరం రూరల్/కల్చరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం.. భక్తుల కొంగుబంగారం.. విజయనగరంలోని పైడిమాంబ అమ్మవారి తొలేళ్ల సంబరం సోమవారం జరగనుంది. మంగళవారం సిరిమానోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు దేవదాయశాఖ, జిల్లా అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. తొలేళ్ల ఉత్సవంలో భాగంగా ఆలయ అనువంశిక ధర్మకర్త, గోవా రాష్ట్ర గవర్నర్ అశోక్ గజపతిరాజు కుటుంబ సభ్యులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి దర్శించుకోనున్నారు. సోమవారం రాత్రి వనంగుడి, చదురుగుడి ప్రాంతాల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సంబరాలు ముగిసే వరకూ భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఆలయా నికి ఇరువైపులా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. 2,600మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నారు. 124 ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, 10 డ్రోన్ కెమెరాలతోపాటు సిరిమాను తిరిగే ప్రాంతంలో రోడ్డుకి ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేశారు. పలు కూడళ్ల వద్ద మూడెంచెల భద్రత కోసం ఇనుపకంచె పెట్టారు.



కేశఖండనశాల వద్ద బారులుదీరిన భక్తులు

ఆదిత్యుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు

- ఆదివారం ఆదాయం రూ.5.29లక్షలు

అరసవల్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రత్యక్షదైవం, ఆరోగ్యప్రదాత అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, కేశఖండనశాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. ఇంద్ర పుష్కరిణిలో స్నానాలు ఆచరించి ఆదిత్యుడ్ని దర్శించుకున్నారు. ఆదివారం ఒక్క రోజే స్వామికి రూ.5,29,382 ఆదాయం లభించింది. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.2,39,500, విరాళాల రూపంలో రూ.71,077, ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.2,18,382 ఆదాయం వచ్చినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

పంచాయతీల్లో నిధుల స్వాహా

- దొంగ బిల్లులతో దోపిడీ
- అరకొరగా పారిశుధ్య నిర్వహణ
- కానరాని అభివృద్ధి పనులు
- పూర్తిస్థాయిలో వినియోగించని స్వర్ణ పంచాయతీ యాప్



- నరసన్నపేట మేజర్ పంచాయతీలో సుమారు రూ.3లక్షలు విలువ చేసే బ్లీచింగ్ కొనుగోలు చేసినట్లు రికార్డుల్లో చూపించారు. వాస్తవానికి రూ.లక్ష బ్లీచింగ్ మాత్రమే కొనుగోలు చేశారు. బ్లీచింగ్ విక్రయించే వ్యాపారితో మిలాఖత్ అయి దొంగ బిల్లులతో సమారు రూ.2లక్షలను పక్కకు వేసి.. సిబ్బంది జీతాల బిల్లులు కోసం డీపీవో కార్యాలయానికి ముడుపు కట్టారని బహిరంగంగా పాలకమండలి సభ్యులే చెబుతున్నారు.

- జిల్లాలోని ఒక పంచాయతీలో ఇటీవల రూ.8లక్షల మేర పనులు చేసినట్లు రికార్డుల్లో చూపించారు. క్షేత్రస్థాయిలో మాత్రం రూ.6లక్షల విలువైన పనులు మాత్రమే జరిగాయి. అధికారులు, పాలకవర్గం సభ్యులు కుమ్మక్కై నిధులు కాజేశారనే ఆరోపణలు ఉన్నాయి. నిధులు వినియోగం పారదర్శకంగా ఉండేలా ప్రభుత్వం 'స్వర్ణ పంచాయతీ యాప్'ను అందుబాటులోకి తెచ్చినా.. జిల్లాలోని చాలా పంచాయతీల్లో అక్రమాలు ఆగడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నరసన్నపేట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు పంచాయతీల్లో నిధులు పక్కదారి పడుతున్నాయి. పంచాయతీల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది 'స్వర్ణ పంచాయతీ యాప్' అందుబాటులోకి తెచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు, ప్రజలు చెల్లించే పన్నులతోపాటు ప్రతి పైసాకు జమా ఖర్చులు పారదర్శకంగా ఉండాలని స్పష్టం చేసింది. కానీ కొన్ని పంచాయతీల్లో ఈ యాప్‌లోను తప్పుడు బిల్లులు అప్‌లోడ్ చేస్తూ.. నిధులు కాజేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పంచాయతీ నిధులతో పాటు ప్రభుత్వం మంజూరు చేసిన బిల్లులను కొందరు సర్పంచ్‌లు పంచాయతీ కార్యదర్శిలతో కలిసి బుక్కేస్తున్నారనే ఆరోపణలున్నాయి. పనులు చేయకపోయినా (మిగతా 5వ పేజీలో..)

నేడు స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని బీఆర్ అంబేడ్కర్ ఆడిటోరియంలో సోమవారం స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'రాష్ట్రస్థాయిలో రెండు అవార్డులు వచ్చాయి. ఇందులో నేలబొంతు ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్, స్వచ్ఛ ఎస్ఎల్ఎఫ్ కేటగిరీలో శ్రీకాకుళంలోని శ్రీ గౌరీశంకర మహిళా సమాఖ్య (వార్డు నెంబర్-26) ఉన్నాయి. జిల్లాస్థాయిలో 14 కేటగిరిల్లో 46 అవార్డులు వచ్చాయి. ఇందులో ఉత్తమ స్వచ్ఛతా హరిత అంబాసిడర్లు-5, స్వచ్ఛతా యోధులు-5, స్వచ్ఛ అంగన్‌వాడీలు -5, స్వచ్ఛ బస్‌స్టేషన్లు-1, స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాలు-3, స్వచ్ఛ గ్రామ పంచాయతీలు-5, స్వచ్ఛ ఆసుపత్రులు-4, స్వచ్ఛ పరిశ్రమలు-3, స్వచ్ఛ మునిసిపాలిటీ-1, స్వచ్ఛ నివాస పాఠశాల -1, స్వచ్ఛ రైతు బజార్-1, స్వచ్ఛ పాఠశాలలు-5, స్వచ్ఛ ఎస్ఎల్ఎఫ్‌లు-2, స్వచ్ఛ గ్రామ సంస్థలు-5 ఉన్నాయ'ని కలెక్టర్ వెల్లడించారు. సాయంత్రం 4 గంటలకు అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుందని తెలిపారు.

10న మెగా జాబ్‌మేళా

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 10న శ్రీకాకుళం అభ్యుదయ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరుగనున్న ఈ మేళాలో హెల్త్‌కేర్, కాన్సెంట్రిక్స్, అరబిందో, కియా మోటార్స్, హెటిరో, స్నైడర్, టాటా ఎలక్ట్రానిక్స్ తదితర 18 ప్రైవేటు కంపెనీలు 1000కి పైగా ఉద్యోగాలకు నియామకాలు చేపట్టనున్నాయి. 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకున్న 18 నుంచి 30 ఏళ్ల మధ్య యువతీ, యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. అభ్యర్థులు తప్పనిసరిగా "నైపుణ్యం. ఏపీ. జీఓవీ.ఇన్"లో రిజిస్ట్రేషన్ చేసుకుని, రిఫరెన్స్ నెంబర్, రెజ్యూమ్, ఆధార్, విద్యార్హతల ప్రతులు, ఫొటోలతో 10న ఉదయం 9 గంటలకు హాజరు కావాలి. ఏమైనా సందేహాలుంటే జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్‌ను 97049 60160, 63010 45132 నెంబర్లలో సంప్రదించాల'ని కలెక్టర్ సూచించారు.

ఉగాదికి రైల్వే ఫ్లైఓవర్ ప్రారంభం
- అదే సమయంలో రైతుబజారు పూర్తి
- కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు
6లో

అక్కడ సాగు.. ఇక్కడ విక్రయం
- నిఘా పెరగడంతో రూటు మార్చిన స్మగ్లర్లు
- గంజాయి రవాణాకు టీనేజర్లను వినియోగిస్తున్న వైనం
5లో

ఉద్యోగుల బకాయిలపై స్పష్టత ఇవ్వాలి
- ప్రభుత్వోద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ

ఈకేవైసీ నమోదుకు
మరో అవకాశం

- ఈ నెల 25వరకు గడువు పెంపు

నరసన్నపేట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతన్నల ఈకేవైసీ నమోదుకు మరో అవకాశం కల్పించింది. గత నెల 30తో ఈకేవైసీ నమోదు గడువు విధించగా.. జిల్లాలో చాలా మంది రైతులకు ఈ ప్రక్రియ పూర్తికాలేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 25వరకూ గడువు పెంచుతూ.. వ్యవసాయశాఖ కమిషనర్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. పంట రుణాలపై వడ్డీ రాయితీ, పంట నష్ట పరిహారం అందించేందుకు, ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యం విక్రయాలు వంటి వాటికి ఈ-పంట నమోదు చేయాల్సిందే. దీనితర్వాత రైతులు ఈకేవైసీ తప్పనిసరిగా ఉండాలి. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 4,75,947 ఎకరాల్లో 3,57,289 మంది రైతులు సాగు చేస్తున్నారు. వీఏఏ, వీఆర్వోలు ఈ-క్రాప్, రైతుల ఈకేవైసీ నమోదు చేస్తున్నారు. జిల్లాలో శనివారం నాటికి 2,36,317 మంది రైతులు ఈకేవైసీ పూర్తయింది. కంచిలి, పొందూరు, శ్రీకాకుళం, రణస్థలం, కవిటి, హిరమండలం, పలాస, జి.సిగడాం, సరుబుజ్జిలి, గార, వజ్రపుకొత్తూరు మండలాల్లో 60శాతం కన్నా తక్కువగా నమోదైనట్టు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ఈనెల 25 వరకు గడువు పెంచడంతో.. శతశాతం నమోదు చేయాలని ఉన్నతాధికారులు వ్యవసాయ, రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారని ఏడీఏ వెంకటమధు తెలిపారు.



తామరాపల్లిలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న అధికారులు(ఫైల్)

రహదారులకు కోత

- వర్షానికి పాడైన రోడ్లు
- గిరిజనులకు తప్పని ఇబ్బందులు



కోతకు గురైన కేరాశింగి గ్రామానికి వెళ్లే రహదారి

మెళియాపుట్టి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల వర్షాల ఉధృతికి గిరిజన ప్రాంతాల్లో రహదారులు కొట్టుకుపోయాయి. మెళియాపుట్టి మండలంలోని కేరాశింగి, గూడ, చందనగిరి, అంపురం, రింపి, పెంగువాడ వంటి గ్రామాల్లో రహదారులు అధ్వానంగా మారాయి. కూటమి ప్రభుత్వం ఈ రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. పనులు కొంతమేర జరిగాయి. కొన్నిచోట్ల రాయిపిండి వేసి వదిలేశారు. సకాలంలో పనులు పూర్తికాకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు కేరాశింగి వద్ద రహదారి కొట్టుకుపోయిందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ తమకు డోలీ మోతలు తప్పవని వాపోతున్నారు.

- మెళియాపుట్టి మండలంలోని నందవ గ్రామానికి వెళ్లే రహదారి కూడా వరద ఉధృతికి కోతకు గురైంది. దీంతో గ్రామానికి వెళ్లలేని దుస్థితి నెలకొంది. అధికంగా కుడ్డబ-రాజపురం, మర్రిపాడు-ముఖందుపురం రోడ్డు పూర్తిగా పాడైంది. ఇటీవల ఉద్దానం తాగునీటి సరఫరా కోసం టెక్కలి-మెళియాపుట్టి రోడ్డుపక్కనే తవ్వి పైపులు వేశారు. దీంతో బెర్మల్ కూలిపోయి రోడ్డు పూర్తిగా పాడైంది. అధికారులు స్పందించి రహదారులు బాగు చేయాలని గిరిజనులు విజ్ఞప్తి చేస్తున్నారు.



నందవ రోడ్డు ఇలా..

అడుగు పెడితే బురదే

గొడ్డ జంక్షన్ నుంచి రింపి మీదుగా పాతపట్నం మండలం తెంబూరు గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా బురదమయమైంది. గతంలో ఈ రహదారికి నిధులు మంజూరు చేసినా పనులు ప్రారంభించలేదు. దీంతో 8 గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వాహనాలు వెళ్లలేక అవస్థలు పడుతున్నారు.



బురదమయంగా రింపి రోడ్డు

కార్మికుల హక్కులకోసం ఉద్యమాలు

● సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు



సోంపేట: మాట్లాడుతున్న సీహెచ్ నర్సింగరావు

సోంపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్మికవర్గం త్యాగాలతో పోరాడి సాధించుకున్న హక్కులు పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు చేపడతామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు తెలిపారు. ఆదివారం సోంపేటలో సీఐటీయూ జిల్లా మహాసభల్లో భాగంగా జిల్లా అధ్యక్షుడు సీహెచ్అమ్మన్నాయుడు అధ్యక్షతన బహిరంగసభ నిర్వహించారు. కాగా ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ అధ్యక్షుడిగా సీహెచ్అమ్మన్నాయుడు, ప్రధానకార్యదర్శిగా పి.తేజేశ్వరరావు, కోశాధికారిగా అల్లు సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా కె.నాగమణి, అల్లుమహాలక్ష్మి, కె.సూరయ్య, డి.గోవిందరావు, బి.ఉత్తర, కార్యదర్శులుగా సంగారు లక్ష్మీనారాయణ, ఎన్.గణపతి,రమణతోపాటు 64మందితో కార్యవర్గం ఎన్నుకున్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

దుర్గాగణేష్ సేవా సంఘం కార్యవర్గం ఎన్నిక

కవిటి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకర్రివానిపాలెంలో దుర్గాగణేష్ సేవాసంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సూర్ని రమేష్,కార్యదర్శిగా సీహెచ్ బోస్, ఉపాధ్యక్షుడిగా ఎస్.ముకుంద, సహాయకార్యదర్శిగా బి.మధు, కోశాధికారిగా జయబాబును ఎన్నుకున్నారు.

ఏపీటీఎఫ్ కార్యవర్గం..

కవిటి మండల ఏపీటీఎఫ్‌కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం కవిటి ప్రభుత్వోన్నత పాఠశాలలో సర్వసభ్యసమావేశాన్ని నిర్వహించారు. గౌరవ సలహాదారుగా బి.లక్ష్మణమూర్తి,గౌరవాధ్యక్షుడిగాఆర్.కృష్ణారావు, అధ్యక్షుడిగా జి.వంశీకృష్ణ, కార్యదర్శిగా జి.రాంబాబు, కోశాధికారిగా పి.వేణుగోపాల్‌లతో పాటు జిల్లా కౌన్సిలర్లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పోరాటంతోనే పరిష్కారమవుతాయని తెలిపారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర కౌన్సిలర్ జి.రాజేష్, రాష్ట్ర కార్యదర్శి డి.సరస్వతి, జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్,పి.తిరుమలరావు పాల్గొన్నారు.

రహదారి పక్కన ముళ్లపొదల తొలగింపు

జి.సిగడాం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆనందపురం వంతెన సమీపంలో రోడ్డు పక్కన ముళ్లపొదలను గ్రామానికి చెందిన యువకులు శ్రమదానంచేసి తొలగించారు. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో యువకులు ఆదివారం యంత్రాలతో చదును చేసి జంగిల్ క్లియరెన్స్‌చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి వజ్జిపర్తి రఘురాం, పొగిరి నారాయణరావు, చిత్తిరి రమణబాబు, డోల అప్పలనాయుడు, చిత్తిరి ఉపేంద్ర, ఆబోతుల సోములు, చిత్తిరి కృష్ణంనాయుడు, లోలుగు లక్షుంనాయుడు, రెడ్డి సురేష్ పాల్గొన్నారు.

'పోరుబాట' విజయవంతం చేయండి

గుజరాతీపేట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఫ్యాప్టో ఆధ్వర్యంలో విజయవాడలో మంగళవారం నిర్వహించే పోరుబాటకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లాచైర్మన్ బి.శ్రీరామ్మూర్తి కోరారు.ఆదివారం శ్రీకాకుళంలోని ఎన్జీవో హోమ్‌లో ఫ్యాప్టో భాగస్వామ్య సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో భాగస్వామ్య సంఘాల నాయకులు వెంకటేశ్వర్లు, రామ్మోహన్, జి.రరమణ, ఎస్.రమేష్‌బాబు పాల్గొన్నారు.

● ఆమదాలవలస, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి):ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు పరిష్కారానికి మంగళవారం విజయవాడలో నిర్వహించే పోరుబాటను విజయవంతం చేయాలని పెన్షనర్ల సంఘ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సురవరపు సిమ్మినాయుడు, బొడ్డపల్లి జనార్దనరావు ఒక ప్రకటనలో కోరారు.ఫ్యాప్టో పోరుబాటుకు పెన్షనర్ల సంఘం తరపున మద్దతును ప్రకటించినట్లు తెలిపారు.

బ్యాడ్మింటన్ పోటీలకు లైన్‌జడ్జిగా సాయినాథ్

శ్రీకాకుళం స్పోర్ట్స్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్.మోహన్ సాయినాథ్‌ను బ్యాడ్మింటన్ వరల్డ్ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీలకు లైన్ జడ్జిగా నియమిస్తూ బాయ్ నుంచి ఉత్తర్వులు అందాయి.ఈ పోటీలు సోమవారం అసోంలోని గౌహతిలోప్రారంభంకానున్నాయి. ఇటీవల అంపైర్‌గా ఎస్.సూరిబాబును నియమించగా, ఆయన గౌహతి చేరుకున్నారు. ఈ పోటీలకుజిల్లా నుంచి ఇద్దరునియమితులుకావడంతో జిల్లా సంఘం ప్రతినిధులు రాజేంద్రన్,అశోక్‌కుమార్, జి.సోమేశ్వరరావు వార్ని అభినందించారు.

చిన్నజొన్నవలసలో కూలిన ఇంటిగోడ

ఆమదాలవలస, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి):చిన్నజొన్నవలసలో ఓ ఇంటి గోడ కూలినట్లు తహసీల్దార్ రాంబాబు తెలిపారు. ఆదివారం ఆమదాలవలసలో విలేకరులతో మాట్లాడారు. గ్రామానికి చెందిన గేదెల గున్నయ్య ఇంటి మట్టిగోడ వర్షంనీటితో తడిసి కూలిపోయినట్లు గుర్తించామని తెలిపారు. గోడకూలడంతో నష్టాన్ని అంచనా వేసి నివేదిక ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.

తేలుకుంచిలో వన్యప్రాణి వారోత్సవాలు



వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఇచ్ఛాపురం, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి):తేలుకుంచి వలస పక్షుల కేంద్రంలో వన్యప్రాణి వారోత్సవాలను అటవీశాఖఅధికారులు ఆదివారం నిర్వహించారు.ఈసందర్భంగావన్యప్రాణుల సంరక్షణ,వాటి ఆవశ్యకత,పర్యావరణ సమతుల్యత, అంతరించిపోతున్న జాతుల వల్ల మానవ మనుగడకు ప్రమాదం పొంచి ఉండడంపై గ్రామస్థులకు వివరించారు. అనంతరం వన్యప్రాణి చట్టాలపై చైతన్యపరిచి ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో డీఆర్వో రాము, మందస బీట్ అధికారులు వెంకటేష్, భానుమూర్తి, జోగారావు, లక్ష్మణరావు, దుర్గాదేవి, సురేష్, గ్రామపెద్దలు ఎం.సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల నుంచి సెల్‌ఫోన్ల స్వాధీనం

శ్రీకాకుళం రూరల్, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి):రూరల్ మండలంలోని బ్యాంకర్స్‌కాలనీలోగల ఓఇంట్లో పేకాట ఆడుతున్న నలుగురిని ఆదివారం రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.11,470 నగదుతోపాటు నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై ఎస్ఐ కె.రాము కేసు నమోదుచేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

గార, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి):గార జడ్పీ ఉన్నత పాఠశాలలో 1998-99 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం నిర్వహించారు. అప్పట్లో బోధించిన గురువులను సత్కరించారు. పూర్వ విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

●ఇచ్ఛాపురం, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): బూర్జపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 2011-12 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకొని పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. వారంతా ఆట పాటలతో సాయంత్రం వరకు సరదాగా గడిపారు.



గార: జడ్పీఉన్నత పాఠశాలలో ఆత్మీయ కలయిక నిర్వహించిన దృశ్యం

అక్కడ సాగు.. ఇక్కడ విక్రయం

● నిఘా పెరగడంతో రూటు మార్చిన స్మగ్లర్లు

● గంజాయి రవాణాకు టీనేజర్లను వినియోగిస్తున్న వైనం

● ఈగల్‌టీమ్ నిఘాతో పెంచిన పోలీసులు

● పలాస రైల్వే పోలీసులకు గతనెల 12న ఇద్దరు టీనేజ్ జంట 40 కిలోల గంజాయితో పట్టుబడింది. కనీసం గంజాయి అంటే ఏమిటో కూడా తెలియని వయసులో డబ్బులకు ఆశపడ్డారు. స్మగ్లర్లగా వారు అవతారం ఎత్తి పోలీసులకు పట్టుబడ్డారు.

●కాశీబుగ్గ ఎస్ఐ నర్సింహమూర్తి గత నెల21న తన పోలీసు బృందంతో పలాస రైల్వేస్టేషన్ రోడ్డులో తనిఖీలు నిర్వహిస్తుండగా ఐదుగురు 85 కిలోల గంజాయితో పట్టుబడ్డారు. అందులో కనీసం 20 ఏళ్లు నిండని యువత ముగ్గురు ఉన్నారు. గంజాయి రవాణా చేసి అక్కడున్న బ్రోకర్‌కు అందజేస్తే రూ.10వేలు వస్తాయని చెప్పడంతో తరలిస్తుండగా పట్టుబడ్డారు.



కాశీబుగ్గ పోలీసులకు పట్టుబడిన గంజాయి స్మగ్లర్లు (వృత్తంలో టీనేజ్ యువత) (ఫైల్)

పలాస, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి)

జిల్లాలో నిఘా పెరగడంతో గంజాయి రవాణాకు స్మగ్లర్లు రూటు మార్చుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈగల్ టీమ్ ఏర్పాటుచేయడంతో గంజాయి అక్రమ రవాణాకు చెక్‌పడింది. ఈ నేపథ్యంలో కొందరు వ్యక్తులు జిల్లాలో సాగు చేయడం నిలిపివేశారు. తాజాగా ఒడిశాలో సాగు చేయడం ప్రారంభించారు. దీంతో అక్కడకొనుగోలుచేసి టీనేజర్ల ద్వారా రవాణా చేయించు కుని ఇక్కడ విక్రయిస్తున్నారు.

గంజాయి కేసుల్లో ఇటీవల 80 శాతం యువకులు, టీనేజర్లు దొరుకుతున్నారు. స్మగ్లర్లు రవాణాకు ఎక్కువగా టీనేజర్లనే వినియోగిస్తున్నారు. ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ గిరిజన ప్రాంతాల్లో కేవలం సాగు తప్ప ఇతర ఆదాయ మార్గాలులేవు. దీంతోపాటు అధికంగా పేదలు పోడు వ్యవసాయం చేసి జీవిస్తున్నారు. ప్రధానంగా ఒడిశాలో గిరిజనులకు ఇతరులపై ఆధారపడాల్సివస్తోంది. గతంలో పురుషులతో అధికంగా రవాణా చేస్తుండేవారు. బస్సులు, కార్లు, బైక్‌లు, రైలు మార్గంలో గంజాయి మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, తెలంగాణవంటి రాష్ట్రాలకు తరలించి, అక్కడ బ్రోకర్లకు అందజేస్తున్నారు. వైసీపీహయాంలో గంజాయిపై నిఘా లేకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా విక్రయాలు అప్పట్లో పెరిగాయి. కూటమి ప్రభుత్వం వచ్చి న తర్వాత గంజాయి రవాణా, పండించే వారిపై నిఘా పెరగడంతో రాష్ట్రంగా గంజాయి సాగుతగ్గింది. దీనికితోడు ఈగల్‌టీమ్ పేరుతో ప్రతి జిల్లాలో నిఘా వ్యవస్థ పనిచేయడంతో గంజాయిపై ఉక్కు పాదం మోపారు. ప్రస్తుతం ఒడిశాలోని ఆర్.ఉదయగిరి, మోహన బ్లాక్ తదితర ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి సాగు యథేచ్ఛగా సాగుతోంది. గతంలో బ్రోకర్ల ద్వారా వివిధ మార్గాలు, వివిధ రూపాల్లో గంజాయి రవాణా జరిగేది. అక్రమ రవాణా అరికట్టడం, పట్టుకొని జైలుకు తరలించడం, వారికి కఠిన శిక్షల నేపథ్యంలో గంజాయి స్మగ్లర్లు రూటు మార్చారు. టీనేజర్లయితే ఎవరికీ అనుమానం రాదు, పైగా సులభంగా గంజాయి తీసుకువెళ్లి నిర్దేశించిన స్థలాలకు చేర్పించవచ్చని స్మగ్లర్లు పథకం వేసుకున్నారు. రెండు నెలల నుంచి ఈ ప్రాంతంలో పట్టుబడు తున్న గంజాయి స్మగ్లర్లలో టీనేజర్లే ఉండడం వారి వ్యూహానికి బలం చేకూరుతోంది. కొంత మంది కుటుంబం గడవక, మరికొంతమంది అత్యాసకు పోయి గంజాయిని తరలిస్తున్నారు. పట్టుబడిన ప్రతిఒక్కరూ కుటుంబ ఆర్థిక పరిస్థితి వల్లే గంజాయి రవాణాచేయాల్సివస్తోందని చెబుతున్న విషయం విదితమే. ఒడిశాలో సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడంతో గంజాయి రవాణా చేసి సులభంగా డబ్బు సంపాదించవచ్చని అత్యాసకుపోయి ఆంధ్రాలో పోలీసులకు పట్టుబడుతు న్నారు. రెండు రాష్ట్రప్రభుత్వాలు పూర్తిస్థాయిలో నిఘా పెట్టడంతోపాటు సరిహద్దు ఏజెన్సీ గ్రామాల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తే గంజాయి తరలింపునకు యువత ముందుకొచ్చే అవకాశముండదన్న వాదన వినిపిస్తోంది.

ప్రత్యేక దృష్టిపెట్టాం..


ఇటీవల ఎక్కువగా టీనేజ్ యువతతో గంజాయి రవాణా చేస్తున్నారని కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ తెలిపారు. ఈ విషయంపై తాము పూర్తిస్థాయి దృష్టి పెట్టామని చెప్పారు. ఇటువంటి మహిళలను పట్టుకోవడానికి ప్రత్యేకంగా మహిళా పోలీసు సిబ్బందిని వినియోగిస్తున్నామని తెలిపారు. గంజాయి రవాణా ఏ రకంగా చేసినా వెంటనే చర్యలు తీసుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

కాలువలు లేక.. మురుగు పారక

● చోద్యం చూస్తున్న నగరపాలక సంస్థ అధికారులు

● ఇదీ శ్రీకాకుళంలోని ఇందిరానగర్ కాలనీలో పరిస్థితి

శ్రీకాకుళం లీగల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో గల ఇందిరానగర్ కాలనీలో కాలువలు నిర్మించకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది.నగరం నడిబొడ్డున ఉండే ఇందిరానగర్ కాలనీ నగరపాలక సంస్థలో విలీనం కాకముందు పంచాయతీగా ఉండేది. చాపురం-2 సచివాలయం పరిధిలో ఇందిరానగర్, తిలక్ నగర్, విశాఖ ఏ కాలనీ,డీసీసీబీ కాలనీ తదితర ప్రాంతాలన్నీ ఉన్నాయి. ఇక్కడ ఐదు వేలకు పైగా జనం నివసిస్తున్నారు. ఇందులోగల ఇందిరానగర్ కాలనీలోకి ప్రవేశించే రోడ్లన్నీ విశాలంగా ఉన్నా నిర్వహణలోపం వల్ల మురుగు, బురద పేరుకుపోతుండడంతో నిత్యం అగచాట్లు తప్పడం లేదు. ప్రధానంగా జనావాసాలు పెరిగినా అందుకు అనుగుణంగా కాలువ వ్యవస్థ అభివృద్ధి చేయకపోవడంతో మురుగు బయటకు వెళ్లే మార్గం లేకపోవడం వల్ల రోజుల తరబడి నిల్వఉండడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని పలువురు వాపోతున్నారు. చిన్నపాటి వర్షం కురిస్తే ఇక్కడి రోడ్లన్నీ జలమయమవుతున్నాయి. వర్షం, మురుగు నీరు బయటకు వెళ్లడానికి వీలుగా కాలువలు ఏర్పాటుచేయలేదు. ఖాళీ స్థలాల్లో మురుగు నీటితోపాటు గుర్రపు డెక్క నిండడంతో కాలనీ వాసులు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయాందోళన చెందుతున్నారు. ఇందిరానగర్ కాలనీలో ఆరు ప్రధాన వీధుల్లోనూ చీకటిపడితే దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఏపాటి వర్షం కురిసినా ఇందిరానగర్ కాలనీ నుంచి పెద పాడు రోడ్డుకు వెళ్లే మార్గంలో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. నగరపాలక సంస్థ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇక్కడ పారిశుధ్య నిర్వహణ కూడా గాడితప్పింది. విలీన ప్రాంతాలు కావడంతో తమ కాలనీలపై అధికారులు దృష్టిసారించడంలేదని ఇక్కడ నివాసముంటున్న వారంతా ఆరోపిస్తున్నారు.



ఇందిరాగనర్ కాలనీలో నీటితో నిండిన రోడ్డు



వాటర్ ట్యాంకు వద్ద నిలిచిన నీరు

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు భరోసా



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

రణస్థలం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు భరోసాగా నిలుస్తోందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ ప్రైవేటు వైద్యం చేసుకున్న 11 మందికి రూ.11.63 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు లంక శ్యామలరావు, చౌదరి బాబ్జీ, పిసిని జగన్నాథంనాయుడు, పిన్నింటి మధుబాబు, గొర్లె శ్రీహరి పాల్గొన్నారు.

మురుగుచేరి.. చెరువును తలపించి

●కాలువలు మూసుకుపోయిన వైనం

● ఇదీ ఆమదాలవలస జూనియర్ కళాశాల ఆవరణలో పరిస్థితి



జూనియర్ కళాశాల ఆవరణలో నిల్వ ఉన్న మురుగునీరు

ఆమదాలవలస,అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వర్షాకాలంలో ఏటా మురుగు చేరి చెరువును తలపిస్తోంది. పట్టణంలోని చిన్నపాటి వర్షం కురిస్తే ఎగువ ప్రాంతంలో మురుగుతోపాటు వరద ఇక్కడికి చేరుతోంది. జూనియర్ కళాశాల, ప్రభుత్వోన్నత పాఠశాల ప్రవేశద్వారం వద్ద వర్షంనీటితోపాటుపట్టణంలోని పలుప్రాంతాల నుంచివచ్చే మురుగు నీరు కూడా నిల్వఉండిపోతోంది.నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు మురుగునీరుతో ఇక్కడ చేరడంతోఈమార్గం గుండా రాకపోకలు సాగించే వారంతా అవస్థలకు గురవుతున్నారు. దసరా సెలవులుఅనంతరం సోమవారం నుంచి కళాశాల, ఉన్నత పాఠశాలలు తెరవనున్నారు. ఈ తరుణంలో ఆవరణలో మురుగునీరు నిల్వ ఉండడంతో వ్యాధులుప్రబలుతాయోమోనని తల్లిదండ్రులు భయాందోళనచెందుతున్నారు.ఉన్నత పాఠశాల, కళాశాల ప్రాంతంలో కాలువలు మూసుకుపోవడంవల్ల ఈ పరిస్థితి నెలకొందని, ప్రజాప్రతినిధులు, మునిసిపల్ అధి కారులు స్పందించి మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసు కోవాలని పలువురు కోరుతున్నారు.

ఉద్యోగులపై చిన్నచూపు తగదు

గుజరాతీపేట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి):ఉద్యోగులపైచిన్న చూపు తగదని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి తెలిపారు. ఆదివారం శ్రీకాకుళంలోని దాసరి క్రాంతి భవన్‌లో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల నుంచి డీఏ పెండింగ్‌లో పెట్టిందని తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ, నాయకులు పి.ప్రభాకరరావు ఎం.సన్యాసిరావు, పి.రామకృష్ణ, కె.తేజేశ్వరరావు, జి.శ్రీనివాసరావు, జి.తిరుమలరావు పాల్గొన్నారు.

ఆడిటోరియం నిర్మించాలి

ఆమదాలవలస, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కళాకారుల కోసం ఆడిటోరియం నిర్మించాలని కళాకారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బగాది తేజేశ్వరరావు కోరారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వోన్నత పాఠశాల ఆవరణలో కళాకారుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు పేడాడ ధనుంజయరావు ఆధ్వర్యంలో కళాకారుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కళాకారుల సంఘ సహాధ్యక్షులు బొడ్డేపల్లి జనార్దనరావు, మండల విద్యాశాఖాధి కారి కల్లేపల్లి అప్పలరాములు, కొచాడ రామారావు, రామాచారి, కూన రాములునాయుడు పాల్గొన్నారు.

గౌరమ్మ సంబరాలు ప్రారంభం



ఫరీద్‌పేటలో తప్పెటగుళ్ల ప్రదర్శన నిర్వహిస్తున్న కళాకారులు

ఎచ్చెర్ల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫరీద్‌పేట, కొత్తపేట,కేశవరావుపేట, బొంతలకోడూరు తదితర గ్రామాల్లో గౌరమ్మ సంబరాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు గౌరమ్మను ఊరేగించారు. పాడిపంటలు వృద్ధి చెందాలని, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని గౌరమ్మను పూజిస్తారు. ఫరీద్‌పేట సమస్యాత్మక గ్రామం కావడంతో గతంలో జరిగిన పలు సంఘటనల దృష్ట్యా శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం, ఎస్ఐ వి.సందీప్ కుమార్ పటిష్ఠ చర్యలు చేపట్టారు.సంబరాల పేరిట చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే సహించేదిలేదని సీఐ అవతారం హెచ్చరించారు.

ఘనంగా తులసమ్మతల్లికి పూజలు

ఇచ్ఛాపురం,అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి):లొద్దపుట్టిలో ధనరాజ తులసమ్మతల్లికి ఆదివారం భక్తి శ్రద్ధలతో పూజలు జరిపించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా వచ్చి మొక్కులు చెల్లించారు.ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు.

ఉద్యోగుల బకాయిలపై స్పష్టత ఇవ్వాలి

● ప్రభుత్వోద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ



మాట్లాడుతున్న సూర్యనారాయణ

అరసవల్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం శ్రీకాకుళంలోని టీటీడీ కళ్యాణమండపంలో ఉద్యోగుల సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 జూన్ నాటికి ప్రభుత్వ ఉద్యోగులకు రూ.25వేల కోట్ల బకాయిలు ఉన్నట్లు అసెంబ్లీలో శ్వేతపత్రం విడుదల చేశారని, ప్రస్తుతం ఈ బకాయిలు రూ.33వేల కోట్లకు చేరుకున్నాయని తెలిపారు.ఇప్పట్లో వాటిని చెల్లించే పరిస్థితులు కూడా కనబడడం లేదని, ఆ బకాయిలను ఎలా చెల్లిస్తారో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉద్యోగికి ప్రభుత్వం ఎంత బకాయి ఉందో సర్వీసు రిజిస్టర్‌లో నమోదు చేసి, ఉద్యోగికి సర్టిఫికెట్ రూపంలో అందజేయాలని కోరారు. చెల్లించలేని పక్షంలో ఆ బకాయికి సమానంగా ఏ ప్రాంతంలో పనిచేస్తున్న ఉద్యోగికి ఆ ప్రాంతంలో భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ విషయంపై ఉద్యోగులతో 12 అంశాలతో కూడిన సమస్యలపై చర్చించేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ వెంకటరెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిమ్మ సోమేశ్వరరావు, ఎం.సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

పంచాయతీల్లో నిధుల స్వాహా

(మూడో పేజీ తరువాయి)

అధికారులను బురిడీ కొట్టిస్తూ బిల్లులు మంజూరు చేయించుకుంటున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇటీవల ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం రెండో విడత 912 పంచాయతీలకు రూ.32.15 కోట్లు విడుదల చేసింది. వీటిపై కొందరు పంచాయతీ పాలకవర్గం సభ్యులు కన్ను పడింది. పంచాయతీ నిధులతో పాటు ఆర్థిక సంఘ నిధులను పక్కదోవ పట్టిస్తున్నారణే ఆరోపణలున్నాయి. మరోవైపు పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అభివృద్ధి పనులు సక్రమంగా జరగడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● స్వర్ణ పంచాయతీ యాప్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ప్రజలు కార్యాలయాలకు వెళ్లకుండానే పన్నులన్నీ డిజిటల్ రూపంలో చెల్లించవచ్చు. ఇంటి పన్నులు, బాకీలను డిజటల్ రూపంలో చెల్లిస్తే నేరుగా పంచాయతీ ఖాతాల్లోకి జమవుతుంది. పంచాయతీలు ఖర్చు చేసే ప్రతి పైసా వివరాలు పారదర్శకంగా ఉంటాయి. దొంగ బిల్లుల చెల్లింపులు అరికట్టవచ్చు. పంచాయతీ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టవచ్చు. కానీ జిల్లాలో ఈ యాప్ నామమాత్రంగా వినియోగించి ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పంచాయతీలో పాలన గాడిన పెట్టాలని, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

ఉగాదికి రైల్వే ఫ్లైఓవర్ ప్రారంభం

● అదే సమయంలో రైతుబజారు పూర్తి ●కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు


అధికారులతో చర్చిస్తున్న మంత్రులు రామ్మోహన్, అచ్చెన్న, ఎమ్మెల్యే శిరీష

కాశీబుగ్గ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పలాసలో నిర్మాణంలో ఉన్న రైల్వే ఫ్లైఓవర్, కాశీబుగ్గ ఎంపీయూపీ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేయనున్న రైతు బజారును వచ్చే ఏడాది ఉగాదికి ప్రారంభిస్తామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడులు తెలిపారు. ఆదివారం కాశీబుగ్గ రైల్వే వంతెన పనులు, రైతు బజారుకు స్థలాన్ని వారు పరిశీలించారు. రైతు బజారు నిర్మాణానికి నిధులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. పనులు వేగవంతానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తమ పంటలను ఇక్కడే విక్రయించవచ్చని అన్నారు. రైతులకు దుకాణాలు ఏర్పాటు చేసి ఎమ్మెల్యే గౌతు శిరీష ఆధ్వర్యంలో అందజేస్తామని అన్నారు. రైల్వే బ్రిడ్జి పనులు వేగవంతం అవుతున్నాయని అన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా దుకాణాలు తొలగించే బాధ్యతను అధికారుల తీసుకున్నారని చెప్పారు. ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేతల ప్రభుత్వమని... హామీ ఇస్తే చేసి తీరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ టీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, ఏఎంసీ చైర్మన్ ఎం.శ్రీనివాసరావు, టీడీపీ పట్టణ అధ్యక్షులు బడ్డ నాగరాజు, పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, జోగ మల్లేశ్వరరావు, చంద్రశేఖర్‌త్యాడి, నరేంద్ర, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం...

సంతబొమ్మాళి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం సాయంత్రం ఉద్దండపాలెం, పాలతలగాం గ్రామాలలో రూ.2 కోట్ల నాబార్డు-ఆర్‌ఐడీఎఫ్ నిధులతో తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని రహదారులపై ఎక్కడా తట్టెడు మట్టి కూడా గత ప్రభుత్వం వే యలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సంఘ నిధులు దారి మళ్లించారని ఆరోపించారు. దీంతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించక అభివృద్ధి కుంటుపడిందన్నారు కూటమి ప్రభుత్వం మౌలిక వసతులకు నిధులు మంజూరు చేస్తోందన్నారు. అనంతరం బోరుభద్రలో రూ.67 లక్షలతో నిర్మించిన పాఠశాల అదనపు భవనాలను మంత్రి ప్రారంభించారు. గ్రామాల్లో రహదారి విస్తరణ పనులను పరిశీలించారు. రహదారి పనుల్లో జాప్యం వల్ల కాలువల్లో దోమలు పెరిగి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన మంత్రి అచ్చెన్నాయుడు పనులు వేగవంతం చేయాలని కంట్రాక్టర్ తాతారెడ్డిని ఆదేశించారు. పర్యవేక్షించాలని ఆర్‌వో కృష్ణమూర్తిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ బాడాన రమణమ్మ, పీఏసీఎస్ చైర్మన్ కూచెట్టి కాంతారావు, ఎల్ఎల్‌నాయుడు, రెడ్డి అప్పన్న, అట్టాడ రాంప్రసాద్, వజ్జ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన కుటుంబానికి పరిహారం పంపిణీ

పలాస, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మందస మండలం సవర టుబ్బూరు గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు సవర బుద్ధయ్య, రూపమ్మలు గోడకూలి మృతి చెందిన సంఘటనపై ఎమ్మెల్యే గౌతు శిరీష స్పందిస్తు ప్రభుత్వం తరఫున నష్టపరిహారం ప్రకటించారు. ఆదివారం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు రూ.8 లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతు మృతుల కుటుంబానికి అన్నీ విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

క్రైం కార్నర్

గల్లంతైన వ్యక్తి కోసం కొనసాగుతున్న గాలింపు


గాలింపు చర్యలు చేపడుతున్న దృశ్యం

ఆమదాలవలస, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగావళి నదిలో గల్లంతైన రైతు కూలి కొక్కిరాల నారాయుడు కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కనుగులవలసకు చెందిన నారాయుడు నాగావళి నదిలో ప్రమాదవశాత్తూ గల్లంతైన విషయం విదితమే. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసిన అధికారులు రెండు రోజులుగా నారాయుడు కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. ఆదివారం కూడా ఎన్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది దూసి రైల్వే బ్రిడ్జి సమీపంలో గాలించారు. నదిలో నీటి ప్రవాహం ఉధృతంగా ఉండడంతో బృందాల గాలింపునకు అవాంతరాలు ఎదురవుతున్నాయని తహసీల్దార్ రాంబాబు తెలిపారు.

13 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

కంచిలి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూదిపుట్టుగలో శనివారం అర్ధరాత్రి పేకాట ఆడుతున్న 13 మందిని అరెస్టు చేసినట్లు కంచిలి ఎస్‌ఐ పి.పారినాయిడు తెలిపారు. గ్రామంలోని ప్రేమ్‌కుమార్‌కి చెందిన ఇంటి టెర్రస్‌పై పేకాట ఆడుతున్నారని వచ్చిన సమాచారం మేరకు రాత్రి 11.30 గంటలకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ మేరకు 13 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.92,960నగదు, 13 సెల్‌ఫోన్‌లు, మూడు మోటారు సైకిళ్లు, 52 పేకముక్కలు, బ్లాంకెట్‌ను స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పారినాయుడు తెలిపారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లలో రద్దీ


నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉన్న ప్రయాణికులు

నరసన్నపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవులు ముగిశాయి. స్వగ్రామాల నుంచి తిరుగు ప్రయాణమయ్యే వారితో ఆదివారం ఆర్టీసీ కాంప్లెక్సులు, బస్సులు కిటకిటలాడాయి. నరసన్నపేట, శ్రీకాకుళం, పలాస, టెక్కలి, పాతపట్నం, ఇచ్ఛాపురం, సోంపేటల నుంచి విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు జనం బయలుదేరారు. ఆర్టీసీతో పాటు ప్రైవేటు బస్సులు, ఇతర వాహనాలు కిటకిటలాడాయి. పల్లెవెలుగు సర్వీసులు కిక్కిరిసిన ప్రయాణికులతో బయలుదేరాయి. బస్సులు వచ్చే సమయానికి... వాటిలోకి ఎక్కేందుకు ప్రయత్నించే ప్రయాణికుల మధ్య నరసన్నపేటలో చిన్నపాటి తోపులాటలు చోటు చేసుకున్నాయి. నరసన్నపేట నుంచి విశాఖపట్నం వెళ్లే సర్వీసులు ప్రయాణికులతో కిక్కిరిశాయి. ఇక పాతపట్నం, టెక్కలి, పలాస, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు వెళ్లే పల్లెవెలుగు సర్వీసుల్లో రద్దీతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

ఆయుర్వేద వైద్యంతో సంపూర్ణ ఆరోగ్యం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ నందనసాయిరెడ్డి

హరిపురం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద వైద్యంతో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవిం చవచ్చని లయన్స్ క్లబ్ సభ్యులు, గాయత్రి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొర్ల కన్నారావు అన్నారు. హరిపురంలోని కల్యాణ మంటపంలో ఆదివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు నందన సాయిరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 160 మందికి వైద్య సేవలందించారు. సైడ్ ఎఫెక్ట్‌లు లేకుండా ఆయుర్వేదంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని అన్నారు. ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు వెంకటేశం, బైరిశెట్టి గున్నయ్య, వైఎస్ ఎన్ మూర్తి, ఎం .లక్ష్మణ్, పుల్లా వాసు, ఎస్.భానూజీ, కె.సురేష్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావం అవసరం

పాతపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక భావం ఎంతో అవసరమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. అచ్యుతాపురం ముత్యాలమ్మ గుడి చేరువలో అయ్యప్పస్వామి సన్నిధానాన్ని ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. అనంతరం ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావాలు చిన్నతనం నుంచి పిల్లలకు అలవాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టుతోనే అభివృద్ధి

(మూడో పేజీ తరువాయి)


అవగాహన సదస్సుకు హాజరైన రైతులు, ప్రజలు

రైతులు సిద్ధంగా ఉన్నారు. కానీ వైసీపీ, కొన్ని పార్టీల నాయకులు ప్రజలను రెచ్చగొడుతున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా అలజడి సృష్టిస్తున్నారు. భూములిచ్చే రైతులకు నష్టం కలిగించకుండా చర్యలు తీసుకుంటాం. మా కుటుంబానికి అండగా నిలుస్తున్న ఈ ప్రాంత ప్రజలకు ఎయిర్‌పోర్టు నిర్మాణం ద్వారా ఉద్యోగాలు కల్పించి వారి రుణం తీర్చుకుంటాన'ని స్పష్టం చేశారు.

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్ మాట్లాడుతూ 'ఎయిర్‌పోర్టు నిర్మాణానికి భూ సేకర ణ ఇంకా జరగలేదు. శాటిలైట్, గూగుల్ ద్వారా ఎయిర్‌పోర్టు నిర్మాణ స్థలాన్ని గుర్తించాం. ఎన్ని గ్రామాల్లో, ఎన్ని ఎకరాలు అవసరమో వివరాలు సేకరిస్తున్నాం, రైతుల గుర్తింపు ఇంకా ప్రారంభించలేదు. కానీ ప్రజలు మాత్రం ఆందోళన పడుతున్నారు. వారి అపోహలు తీర్చేందుకు గ్రామాల వారీగా అభిప్రాయ సేకరణ చేపడతాం. ఎయిర్‌పోర్టు భూములకు సంబంధించి ప్రాథమిక దశలో అక్కడి మట్టి సారం బాగోకపోతే నిర్మించం. ప్రజలు కూడా అధికారులతో సహకరించాలి. భూములిచ్చిన రైతులకు మెరుగైన ప్యాకేజీ, ఉపాధి అవకాశాలు కల్పించిన తరువాతే భూ సేకరణ చేస్తామ'ని తెలిపారు.

● ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ 'ఎయిర్‌పోర్టు భూ సేకరణ కంటే ముందుగా ప్రజలకు వాటి విలువపై అవగాహన కల్పించాలి. నేనూ రైతు కుటుంబానికి చెందినవాడినేనని, భూములు కోల్పోతే రైతుపడే బాధ నాకు తెలుసు. ప్రజలకు ఒప్పించడంలో వెనుకబడి ఉన్నాం. మంచిని ఒప్పించండి. మంచి బయటకు రాకముందే చెబు చుట్టుతిరిగి వస్తోంది. దీన్ని అధిగమిస్తే మంచి ఫలితాలు వస్తాయి. అనవసరంగా ప్రజలను రెచ్చగొట్టి భయభ్రాంతులకు గురిచేస్తే మాత్రం ఊరుకునేది లేద'ని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ పృధ్వీరాజ్‌కుమార్, ఆర్డీవో జి.వెంకటేష్, టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, ఎం.నరేంద్ర(చిన్ని), గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు పాల్గొన్నారు.

నందన్న సంబరాలకు గ్రామాల్లో సన్నాహాలు


నరసన్నపేట: పండ్లు కొనుగోలు చేస్తున్న మహిళలు


జలుమూరు: సిద్ధమైన నందన్నలు

నరసన్నపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో అత్యంత వైభవంగా జరుపుకునే పండుగ గౌరీ పౌర్ణిమ. రైతు కుటుంబాల మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఈ వేడుకలను నిర్వహిస్తారు. సోమవారం గౌరీ పౌర్ణిమ సందర్భంగా పూజలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నందన్న సంబరాలు నిర్వహిస్తారు. రైతులు కొన్ని గ్రామాల్లో పున్నమి నాడు అమ్మవారి ఆలయాల ముందు పత్రి కొమ్మలు వేసి మొక్కలు చెల్లించి... వాటిని పొలాల్లో నాటుతారు.

మార్కెట్ కళకళ

గ్రామీణ ప్రాంతాల్లో అత్యంత వైభవంగా నిర్వహించే గౌరీపున్నమి వేడుకలకు మహిళలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ఉత్సవాలకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేసేవారితో నరసన్నపేట మార్కెట్ కళకళలాడింది. పండ్లు, పువ్వులు, ఇతర వస్తువులు కొనుగోలుకు మహిళలు ఆదివారం తరలిరావడంతో నరసన్నపేట మార్కెట్ కిటకిటలాడింది.

నందిగాంలో...

నందిగాం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): గౌరీపౌర్ణమిని పురస్కరించుకొని నందిగాం మార్కెట్ ఆదివారం కొనుగోలుదారులతో కిటకిటలాడింది. సోమవారం మహిళలు గౌరీపౌర్ణమిని ఆచరించనుండడంతో మార్కెట్‌లో ఏర్పాటు చేసిన పండ్ల దుకాణాలు, పూజా సామగ్రి దుకాణాలు కిటకిటలాడాయి.

జలుమూరులో...

జలుమూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది గౌరీ ఉత్సవాలకు నందన్నలను సిద్ధం చేశారు. సోమవారం గౌరీ పౌర్ణమి కావడంతో ఉత్సవాలను ప్రారంభిస్తారు. పౌర్ణమి రోజున శివపార్వతులతో సహా గంగాదేవి ఆసీనులైన నందన్నను గ్రామాల్లో ఊరేగిస్తారు. ఈమేరకు మండలంలోని వివిధ గ్రామాల్లో గౌరీ ఉత్సవాల నిర్వహణకు స్థానికులు ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ గ్రామాల్లో మూడు నుంచి తొమ్మిది రోజుల వరకు ఈ ఉత్సవాలను నిర్వహిస్తారు.

పంట నష్టపోయిన రైతులకు పరిహారం:ఎమ్మెల్యే


దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

హిరమండలం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వంశధార, మహేంద్ర తనయ నదులకు వచ్చిన వరదతో నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం అందిస్తుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. గులుమూరు, జిల్లోడిపేట గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. తంగతంప గ్రామ సమీపంలో కోతకు గురైన వంశధార వరద కట్టను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పంట నష్టపోయిపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. కల్లట-జిల్లోడిపేట గ్రామాలకు మధ్యలో మహేంద్రతనయ నదిపై వంతెన నిర్మించేలా చూడాలని ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. మహేంద్ర తనయ నదికి వరద వస్తే గ్రామం జల దిగ్బంధంలో ఉంటుందని... బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయని ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. వంతెన నిర్మిస్తే తమ ఇబ్బందులు తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు, ప్రత్యేక ఆహ్వానితులు తూలుగు తీరుపతిరావు, మండల టీడీపీ అధ్యక్షులు దారపు డిల్లేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలకు ఎంపిక



టెక్కలి: రగ్బీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో వ్యాయామ ఉపాధ్యాయులు

టెక్కలి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ బాలబాలికల అండర్-14, అండర్-17, అండ ర్-19 విభాగాలో జిల్లా జట్లను ఎంపిక చేశారు. నెట్‌బాల్, రగ్బీ, రోప్‌స్కిప్పింగ్, షూటింగ్ బాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను టెక్కలి డివిజన్ ఇన్‌చార్జ్ బాడాన నారాయణరావు ప్రారంభించారు. ఈ పోటీలకు 95 పాఠశాలల నుంచి 650 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రతి గేమ్‌కు 12 మంది బాలురు, 12 మంది బాలికల వంతున ఎంపిక చేసినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కేకే రామిరెడ్డి, ఎస్.లక్ష్మణరావు, ఎస్.కృష్ణారావు, ఎన్.నాగరాజు, పి.వెంకటరమణ, డి.లక్ష్మీనారాయణ, ఎల్.నీలకంఠేశ్వరరావు, అలివేణి, లోకేశ్వరరావు, వై.త్రినాథరావు, పి.జగదీశ్వరరావు, ఎస్.రమేష్, సీతయ్య, వి.అజయ్, నర్మద తదితరులు పాల్గొన్నారు.

యోగాలో...

నరసన్నపేట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు జిల్లా నుంచి పాల్గొననున్న యోగా క్రీడాకారులను ఆదివారం సత్యవరం ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఎంపిక చేశారు. అండర్ 14, అండర్ -17, అండర్ -19 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా ఎంపిక చేశారు. ఒక్కో విభాగంలో ఆరుగురు వంతున మొత్తం 36 మందిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ సలహాదారులు కె.రాజారావు, ఎంఈవో శాంతారావు, పీఈటీలు జ్యోతిరాణి, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో..

హిరమండలం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో ఆదివారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో హిరమండలం మండలానికి చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు శిక్షకుడు తోట సింహాచలం చెప్పారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో చదువుతున్న సుభలయ ఆర్ఆర్ కాలనీకి చెందిన టి.గుణశ్రీ 40 కేజీలు, టి.గీతశ్రీ, టి.ఝాన్సీలక్ష్మి 50 కేజీల విభాగాలలో రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. కొత్తూరు మండలానికి చెందిన మనుశ్రీ, జి.లాస్య, పి.చరిష్మ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్టు సింహాచలం తెలిపారు.

క్రమశిక్షణను పెంపొందించండి


జేజేఎస్ ప్రతాప్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మెళియాపుట్టి, అక్టోబరు 5 (ఆంధ్ర జ్యోతి): క్రమశిక్షణ గల విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని రాష్ట్ర ప్రయివేటు పాఠశాలల సంఘ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజు సూచించారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నలంద పబ్లిక్‌స్కూల్ కరెస్పాండెంట్ జేజేఎస్ ప్రతాప్‌ను ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే వారిని తయారు చేయవలసిన బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజల్లో చైతన్యం కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు మార్గదర్శకంగా నిలవాలి

పాతపట్నం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకంగా నిలవాలని వక్తలు అన్నారు. ఉపాధ్యాయులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థులలోని సృజనాత్మకతను ఉపాధ్యాయులు వెలికి తీయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్‌టీ రామారావు, బీవీ రమణ, కోటి, విజయ్, రామలక్ష్మి పాల్గొన్నారు.

సంస్కృతి పరిరక్షణకు కృషి చేయాలి

పాతపట్నం/రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణలో ఆదర్శంగా నిలవాలని చాత్తడ శ్రీవైష్ణవ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు టి.కృష్ణరాజు తెలిపారు. బూరగాం గ్రామంలోని సత్యనారాయణ స్వామి మందిర ఆవరణలో ఆదివారం జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైందవ జాతి ఐక్యత భావి తరాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు వి.మురళీకృష్ణ, కోనేటి మోహనరావు పాల్గొన్నారు.

విద్యుత్ సౌకర్యం పునరుద్ధరణ

మెళియాపుట్టి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలు, గాలులకు కొండల పైన ఉన్న అడ్డివాడ, కేరాశింగి, గూడ గ్రామాలకు విద్యుత్ సరఫరా చేసే స్తంభాలు పూర్తిగా పడిపోయాయి. దీంతో గత మూడు రోజులుగా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. ఈమేరకు గిరిజన సంఘ నాయకులు బి.దినకర్‌రావు, బి.ధరణిలు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీంతో సంబంధిత సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి.. సరఫరాను పునరుద్ధరించారు.

బురదలో కూరుకుపోయిన కార్గో బస్సు


బస్సు కూరుకుపోయిన దృశ్యం

నందిగాం, అక్టోబరు 5 (ఆంధ్ర జ్యోతి): పాఠ్య పుస్తకాలను పాఠశాలలకు అందించేందుకు వచ్చిన ఆర్టీసీ లాజిస్టిక్ కార్గో బస్సు బురదలో కూరుకుపోయింది. మండల స్థాయిలో నందిగాం ఉన్నత పాఠశాల కేంద్రంగా సెమిస్టర్-2 పాఠ్య పుస్తకాల ను టెక్కలి ఆర్టీసీ డిపోకు చెందిన కార్గో బస్సు తీసుకువచ్చింది. ఇటీవల కురిసిన వర్షానికి పాఠశాల ఆవరణ చిత్తడిగా మారింది. దీంతో బస్సు కూరుకుపోవడంతో సిబ్బంది, కార్మికులు ఇబ్బందులు పడ్డారు. చివరికి మరో వాహనం సాయంతో బస్సును బయటకు తీశారు.

న్యూస్ బాక్స్

25న నాగబంధాల ప్రతిష్ఠ

కోటబొమ్మాళి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): చిన్న హరిశ్చంద్రపురంలోని పంచధామ క్షేత్రంలో ఈనెల 25న 100 నాగ బంధాలు ప్రతిష్ఠించనున్నట్టు ఆలయ ధర్మకర్త ఉప్పాడ కనకరాజు ఆదివారం తెలిపారు. లోకకల్యాణం నిమిత్తం వీటిని ప్రతిష్ఠిస్తున్నట్టు తెలిపారు.

14న ఉచిత వైద్య శిబిరం

కోటబొమ్మాళి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఈనెల 14న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సేవా సమితి సభ్యులు తెలిపారు. స్థానిక సత్యసాయి మందిరం వద్ద ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహిస్తామని తెలిపారు.

టి-10 క్రికెట్ జట్టుకు కోటబొమ్మాళి యువకుడు

కోటబొమ్మాళి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): భారత టి-10 క్రికెట్ జట్టుకు కోటబొమ్మాళి వాసి, ప్రస్తుతం వైజాగ్ మల్కాపురంలో ఉంటున్న మూగు ఈశ్వరరావు ఎంపికయ్యాడు. డిసెంబర్ 25 నుంచి 31వరకు థాయిలాండ్‌లో జరగబోయే సెకండ్ ఏసియన్ టెన్నిస్ బాల్ టి-10 క్రికెట్ చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనబోతున్నాడని ఏపీ టీ-టెన్ క్రికెట్ అసోసియేషన్ పీడీ సుకుమార్ తెలిపారు. ఈశ్వరరావును టీడీపీ బీసీసెల్ అధికార ప్రతినిధి రమణారెడ్డి తదితరులు అభినందించారు.

పురస్కారానికి ఎంపిక

ఎల్.ఎన్.పేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర పురస్కారానికి మండలంలోని చింతల బడవంజ అంగన్‌వాడీ కేంద్రం ఎంపికైందని కొత్తూరు సీడీపీవో ఉమాజానకి తెలిపారు. జిల్లా కేంద్రంలో సోమవారం అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త సరస్వతి, సర్పంచ్, కార్యదర్శికి కలెక్టర్ అవార్డును అందజేస్తారని వివరించారు.

విద్యార్థుల శ్రమదానం

పలాస రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణాపురం దరి సత్యసాయి విద్యావిహార్ ఆవరణలో ఆదివారం 125 మంది విద్యార్థులతో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. అక్టోబరు 2 నుంచి 20వ తేదీ వరకూ స్వచ్ఛత నుంచి దివ్యత్వం అనే కార్యక్రమంలో భాగంగా దీనిని చేపట్టినట్లు పాఠశాల ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు తాళాసు శ్రీను, ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి, ఉపాధ్యాయులు అనుదీప్, లావణ్య, పీఈటీ గురునాథ్ పాల్గొన్నారు.

ఆహార నియమాలు పాటించండి

పలాసరూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఆహార నియమాలను పాటించాలని నెఫ్రాలజిస్టు గొరకల గిరిబాబు అన్నారు. గొల్లమాకన్నపల్లి గ్రామంలో ఆదివారం మిషన్ ఆయుష్మాన్, ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక సంయుక్తంగా కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం వైద్యశిబిరం నిర్వహించాయి. డాక్టర్ గిరిబాబు 100మంది కిడ్నీరోగులకు పరీక్షలు చేసి.. ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బొమ్మాళి శివ, కుత్తుమ ప్రకాశరావు, కుత్తుమ వినోద్, గీతమ్మ, బి.చిన్నారావు పాల్గొన్నారు.

అమ్మవారికి చల్లదనం

కాశీబుగ్గ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో అప్పనమ్మ తల్లి చల్లదనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని విచిత్ర వేషధారణలు, మేళాతాళాలతో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.